క్లుప్తంగా

రేపు రాయలసీమ విద్యార్థుల సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌ఓ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆదోనిలో రాయలసీమ విద్యార్థుల సదస్సును గురువారం నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌ఓ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరప్రతాప్, ఇమ్రాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పాలకులు రాయలసీమ అభ్యున్నతికి పాటుపడలేదన్నారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగం, సాగునీటి ప్రాజెక్టులు, కరువు నివారణ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సీమలో కరువు, వలసలు, విద్య, ఉపాధి తదితర సమస్యలపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. విద్యార్థులు, మేధావులు హాజరుకావాలని కోరారు.

కూలీలకు పనులు కల్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరురూరల్: కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఐపీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ విమర్శించారు. పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుందని అధికారం అప్పగిస్తే నిలువునా మోసం చేసిందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని తుంగభద్ర నది తీరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం సీఐ రామాంజులు ఆదేశాల మేరకు స్థానిక నది తీరంలో ఉన్న గంగమ్మ గుడి వద్ద సోదాలు చేశారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఈడిగ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి కర్ణాటక మద్యం ఒరిజినల్ చాయిస్ 120 టెట్రా ప్యాకెట్లు(90ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గడ్డివాముల దగ్ధం



మూగలదొడ్డిలో దగ్ధమవుతున్న గడ్డివాములు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో ఉప్పర ప్రశన్న, తలారి ఆంజనేయులకు చెందిన రెండు గడ్డి వాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. మంగళవారం గ్రామ శివారులో పశువుల మేత కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డి వాముల నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించినా ఆదోని, ఎమ్మిగనూరు నుంచి గ్రామం చాలా దూరం కావడంతో రాలేకపోయాయి. పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి మంగళవారం గుంతకల్ వాస్తవ్యులు రంగరావు కుటుంబ సభ్యులు రూ.60 వేల విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, అర్చకులు రమేష్‌స్వామి, శివపుత్రస్వామి పాల్గొన్నారు.

సదరం.. సమరం

- ఆదోనిలో సదరం క్యాంపు
- వసతులు లేక దివ్యాంగుల ఇబ్బందులు
- రాత్రి సమాచారం ఇచ్చి ఉదయానికి రమ్మనడంపై అసహనం
- కర్నూలు, నంద్యాల నుంచి అష్టకష్టాలు పడి హాజరు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం



బుద్ధిమాంద్యం కుమారుడితో తల్లి వీణ



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్



బుద్ధిమాంద్యం గల కుమార్తెతో తల్లి రాధ

ఆదోనిటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే పింఛన్లను కుదించడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా దివ్యాంగ నిర్ధారణ పరీక్షలకు నిర్ణయించింది. అయితే ముందస్తు ప్రణాళిక లేకుండా హడావుడిగా సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తుండడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి సదరం క్యాంపు 150 నుంచి 170 కిలోమీటర్లు ఉండడంతో దివ్యాంగులు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా హాజరుకావాలని అధికారుల నుంచి సమాచారం వస్తుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదోనిలో జరిగిన సదరం క్యాంపే ఇందుకు ఉదాహరణ.

వ్యయప్రయాసం

పింఛన్ల రీవెరిఫికేషన్‌లో భాగంగా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు ఏర్పాటు చేశారు. శిబిరానికి ఆదోనితో పాటు నంద్యాల, కర్నూలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు, చెవిటి, మూగ, కంటి, బుద్ధిమాంద్యం గల పింఛన్‌దారులు దాదాపు 200 మంది వరకు హాజరయ్యారు. కర్నూలుకు చెందిన ఆయా వ్యాధుల స్పెషలిస్టు వైద్యులు విద్యాసాగర్, నిషాద్, చంద్రశేఖర్, ఏటీ రాజు పరీక్షలు చేసి సర్టిఫికెట్లను పరిశీలన చేశారు. దాదాపు 150 నుంచి 170 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల, 100 కి.మీ. దూరంలో ఉన్న కర్నూలు నుంచి బుద్ధిమాంద్యం గల పిల్లలతో ఆదోనికి ఉదయాన్నే 9 గంటల కల్లా చేరుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటోలు, కార్లు ఏర్పాటు చేసుకుని వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందని వాపోయారు. క్యాంపు వల్ల సరైన వసతులు కూడా ఏర్పాటు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. గతంలోనే తమ పిల్లల పరిస్థితిని పరిశీలించి సర్టిఫికెట్లు ఇచ్చారని మళ్లీ వెరిఫికేషన్ పేరుతో వందల కి.మీ. తిప్పడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారు ఇబ్బందులు పడి క్యాంపులకు హాజరయ్యారు. అధికారులు, ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నో ఇబ్బందులతో ఆస్పత్రికి వచ్చాం

ఆదోని పట్టణంలోని ఎంఐజీ కాలనీలో నివాసముంటున్నాం. మా కుమార్తె అమూల్య బుద్ధిమాంద్యం కలదు. ఆమెను ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు ఎన్నో కష్టాలు పడ్డాం. ప్రత్యేకంగా ఆటోలో తీసుకొచ్చాం. వెరిఫికేషన్ ఎందుకో, ఇన్ని కష్టాలు పడుతున్నాం. ప్రభుత్వం మా లాంటి పేదలకు మినహాయింపు ఇచ్చి న్యాయం చేయాలి.

–బుద్ధిమాంద్యం బాలిక తల్లి వీణ

కళ్లు కనిపించవు.. ఇబ్బంది పడ్డా



నాకు కళ్లు పూర్తిగా కనిపించవు. సచివాలయం అధికారుల సమాచారం మేరకు వైద్యశిబిరానికి వచ్చాను. రావడానికి చాలా ఇబ్బంది పడ్డాను. వెరిఫికేషన్ పేరుతో శిబిరాలకు హాజరుకావాలంటే చాలా కష్టంగా ఉంది. కుటుంబ సభ్యుల సాయంతో వచ్చాను. –అక్రమ్, ఆదోని

సహాయకులు అవసరం



నాకు రెండు కళ్లు కనిపించవు. ఇంటి నుంచి వైద్యశిబిరానికి రావాలంటే ఇద్దరు, ముగ్గురు సహాయకులు ఉండాలి. ఆటోలో రావాలి. రానుపోను అనేక వ్యయప్రయాసాలు పడ్డాం. నా పరిస్థితి చూసి కూడా వైద్యశిబిరానికి పిలవాల్సిన అవసరం ఏముంది. శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని చెప్పడం ఆవేదన కలిగిస్తోంది.

–జాఫర్, బారాకమాన్ ఏరియా, ఆదోని

ఫుట్‌బాల్ విజేత ఫలక్‌నుమా జట్టు

- రన్నర్‌గా నిలిచిన ఎమ్మిగనూరు జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న తహసీల్దార్, నిర్వాహకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎమ్మిగనూరుకు చెందిన వైఎఫ్‌ఏ జట్టు నిలిచింది. మంగళవారం విజేత జట్టుకు తహసీల్దార్ శేషఫణి, విద్యుత్ శాఖ డీఈ నాగేంద్రప్రసాద్, హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, చిత్రలేఖ, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి ట్రోఫీతో పాటు రూ.1.50 లక్షల నగదు బహుమతి అందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు రూ.లక్ష, మూడో స్థానంలో నిలిచిన గోల్డెన్ హైదరాబాద్ జట్టుకు రూ.50వేలు, నాల్గో బహుమతిగా రూ.25వేలను చైతన్య ఎఫ్సీ జట్టుకు అందజేశారు. నిర్వాహకుడు రామకృష్ణనాయుడు, కౌన్సిలర్లు రామ్‌దాస్‌గౌడ్, ఇషాక్, అమాన్, మహేంద్రబాబు, భాస్కర్, బందె నవాజ్ పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా నంద్యాల జిల్లా గడివేముల మండలం చిందుకూరు గ్రామంలో అంతర్ పాఠశాలల బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 48 జట్లు పాల్గొన్నాయి. ఇందులో కర్నూలు జిల్లా నుంచి పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి రూ.20 వేలు అందుకున్నారని హెచ్‌ఎం ఇందిరాదేవి, పీడీ జి.రామన్న తెలిపారు. ఫైనల్స్‌లో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై 26–06 పాయింట్లతో పెద్దహరివాణం పాఠశాల జట్టు విజయం సాధించిందన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాలలో గెలుపొందిన జట్టును అభినందించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదువులో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, చిరంజీవి, నాయక్, యల్లప్ప, పర్వీన్, పుష్పలత, వేణుగోపాల్, శివరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్టు చేయాలి



వైఎస్సార్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కౌతాళం: దళితుడు ఈరన్న పంటను నాశనం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జైభీమ్ సాయిరామ్ జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని కుంబళనూరు గ్రామంలో ఈరన్నకు చెందిన పొలంలో ఈనెల17న వరి పంట కోత దశలో ఉండగా అదే గ్రామానికి చెందిన కురువ ముదిగౌడ్, మహదేవప్ప వీరేష్, పక్కిరప్ప, పంపన్నగౌడ్ తదితరలు కలిసి పంటను కాల్చారని.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా బాధితునికి న్యాయం జరగడం లేదన్నారు. దళితులకు అండగా ఉండాల్సిన పోలీసులు ముద్దాయిలకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. దళిత సంఘం నాయకులు దాసరి సురేష్, రాము, బసవ, శివకుమార్, శ్రీనివాసులు, మారెమ్మ, ఈరమ్మ, తాయమ్మ పక్కీరమ్మ, వెంకటేష్ మాలగంగ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతాం



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ

ఆదోని రూరల్: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సైదుల్లా పేర్కొన్నారు. మంగళవారం ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం మండలం కుంబళూరు పరిధిలో కర్ణాటక మద్యం తరలింపుపై దాడులు నిర్వహించారు. ఇందులో కుంబళూరు క్యాంపు గ్రామానికి చెందిన ముత్యాల ప్రసాద్ అనే వ్యక్తి వద్ద నుంచి ఏడు కేసుల కర్ణాటక బీర్లు, నాలుగు బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక మద్యం తరలించినా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు కేసులకు మించితే సంబంధిత వ్యక్తుల వివరాల నివేదికను జిల్లా ఎస్పీకి పంపించి వారిని జిల్లా బహిష్కరణ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారు చేద్దాం



షెడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

పెద్దకడబూరు: పెద్దకడబూరు మేజర్ పంచాయతీలో త్వరలోనే చెత్తనుంచి సంపద తయారు చేసి సంపద సృష్టిద్దామని సర్పంచ్ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి అన్నారు. మంగళవారం పంచాయతీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వాహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వాహణ, మంచినీటి సరఫరా, పంచాయతీ కార్మికుల జీతాల చెల్లింపుల గురించి చర్చించారు. గ్రామంలో రాబోయే శివరాత్రి, జాతరను దృష్టిలో పెట్టుకుని వీధి దీపాలు, డ్రైనేజీ పూడిక తీత తదితర అంశాలపై వార్డు సభ్యులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సహకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని సర్పంచ్ రామాంజినేయులు పేర్కొన్నారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు.

26 నుంచి రాళ్లదొడ్డిలో క్రికెట్ టోర్నమెంట్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో మారెమ్మ అవ్వ దేవరను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ నుంచి వైఎస్సార్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఫణీంద్ర, మునిస్వామి, ఫరూక్, రామకృష్ణ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఈ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ. 2 వేలు అందచేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోపు రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9398944628, 8464838067 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అమ్మ గోరు ముద్దలు పుస్తకావిష్కరణ



పుస్కకావిష్కరణలో అతిథులు

పెద్దకడబూరు: కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన అమ్మ గోరు ముద్దలు 62వ పుస్తకాన్ని విజయవాడ కొత పూర్ణానంద విలాస్‌లో కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండా ప్రతాప్, కర్నూల్ కన్జ్యూమర్ ఫోరం జడ్జి నరహరి నారాయణరెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. సోమన్నకు తెలుగు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో డప్పు కళాకారుడు కేశవయ్య, ప్రముఖ కవులు, కళాకారులు పాల్గొన్నారు.

మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారిణి రాజేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

గోనెగండ్ల: క్రీడలు ఆడే బాలికలను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోగలరని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గోనెగండ్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఇంటర్ విద్యార్థిని రాజేశ్వరి బేస్‌బాల్‌లో జాతీయ స్థాయిలో ఆడింది. మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. మహిళలు ఎందులో తక్కువ కాదని ఎవరికీ భయకుండా ధైర్యంగా ముందుకు వెళ్లి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలే ఎక్కువ విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ క్యాలెండర్ల ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు ఆవిష్కరించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, కార్మికులు, కర్షకులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నారు. సరైన వేతనాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు విజయేంద్ర, విరాంజినేయులుగౌడ్, యోహాన్, రంగస్వామి గౌడ్, వీరేంద్ర, మునిస్వామి పాల్గొన్నారు.

మొక్కుబడిగా పశు ఆరోగ్య శిబిరం

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు గోనెగండ్ల మండలంలో తూతూ మంత్రంగా సాగుతున్నాయి. పాడి పశువుల్లో పిడుదుల నివారణ, గర్భకోశవ్యాధి చికిత్స, లంపీస్కిన్‌తో పాటు అన్ని రకాల రోగాలకు చికిత్స అందించేందుకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అయితే మండలంలో పశు వైద్యులు ఈ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించకుండా తూతూ మంత్రంగా జరిపి ముగిస్తున్నారు. మంగళవారం అలువాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని పశు వైద్య సిబ్బంది నిర్వహించారు. ఆరోగ్య శిబిరాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి ముగించారు. విషయం రైతులందరికీ తెలియకపోవడంతో కొందరు మాత్రమే తమ పశువులను శిబిరాలకు తీసుకొచ్చి చికిత్స చేయించి తీసుకెళ్లారు. కార్యక్రమం రెండో రోజే ఇలా జరిగితే ఇక చివరి వరకు జరిగినట్టేననే మాట వినిపిస్తోంది.



అలువాలలో పశువులకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యులు

బాలికలకు ఆత్మరక్షణ ముఖ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న రూరల్ సీఐ మధుసూదన్‌రావు, సీడీపీఓ

ఎమ్మిగనూరురూరల్: బాలికలకు ఆత్మరక్షణ ఎంతో ముఖ్యమని తహసీల్దార్ శేషఫణి, రూరల్ సీఐ మధుసుదన్‌రావు, సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బాలిక వికాసంపై మహిళా పోలీసులు, సచివాయల ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంచి బాలికలు విద్యకు దూరం అవుతున్నారని చెప్పారు. హైస్కూల్ స్థాయికి వచ్చేలోపే బాలికలను విద్యకు దూరం చేసి పెళ్లిళ్లు చేస్తున్నారని, ఇందులో మార్పు రావాలన్నారు. బాలికలను బాగా చదివిస్తే మంచి స్థాయికి వెళ్తారని తెలిపారు. బాల్యవివాహాలు చేయడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పాల్సిన బాధ్యత తల్లులపై ఉందన్నారు. సెల్ ఫోన్ల ప్రభావం, యూట్యూబ్స్ వల్ల చాలా వరకు యువత చెడుమార్గాలను ఎంచుకుంటున్నారని తెలిపారు. చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే భయపడకుండా తల్లిదండ్రులకు చెప్పాలని, అలాంటి వాటిని ధైర్యంగా ఎదుర్కొవాలని చెప్పారు. పోక్సో యాక్ట్ బాలబాలికలకు సంబంధించిన పవర్‌ఫుల్ యాక్ట్ అన్నారు. బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన వారికి ఈ యాక్ట్ ద్వారా కఠిన శిక్షలు పడుతాయని తెలిపారు. అనంతరం బాలకల రక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్ల పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో ఎంఈఓ ఆంజనేయులు, ఈఓఆర్డీ విజయలక్ష్మీ, ఏపీఎం జయశ్రీ, హలహార్వి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ తాఫిక్‌బాషా, సూపర్‌వైజర్లు ప్రీతి, గుణశేఖరమ్మ, సురేఖ పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు చెక్ పెడుదాం



కిశోర వికాసం శిక్షణలో అంగన్‌వాడీలు

పెద్దకడబూరు: బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకట్టు వేసేందుకు అందరి సహకారం అవసరమని సీడీపీఓ నాగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసంపై మంగళవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహం బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలు దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారం, నేరమని ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాల్య వివాహాలపై ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి బాలికలను కాపాడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. బాల్య వివాహాలకు ప్రోత్సహించినా, చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కోసిగి, కౌతాళం, మంత్రాలయం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వీరగోవిందమ్మ, అఖిల, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, కాత్యాయని, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, సర్పంచ్ రామాంజినేయులు, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

అధికారులే నోటీసులు ఇచ్చేలా చూడండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎల్‌టీపీలు

ఆదోని టౌన్: పట్టణంలో నిర్మాణాలకు సంబంధించి మంజూరైన ప్లాన్‌లకు చెల్లించాల్సిన వివిధ ఫీజుల్లో బకాయిపడ్డ ఫీజులను చెల్లించాలని అధికారులే నోటీసులు ఇవ్వాలని పట్టణానికి చెందిన ఎల్‌టీపీలు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ విధానం ప్రారంభంలో యజమానులు చెల్లించాల్సిన కొన్ని ఫీజులు చెల్లించకపోవడంతో ఆ బకాయిలను వసూలు చేసే బాధ్యత ఎల్‌టీపీలపై ఉంచడం తమకు ఇబ్బందికరంగా ఉందన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు నేరుగా యజమానులకు నోటీసులు జారీ చేసి వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌టీపీ అసోసియేషన్ సభ్యులు రంగస్వామి, చంద్రశేఖర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి



ఉపాధి కూలీలతో కలిసి కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: వలసలను నివారించాలని కోరుతూ ఈనెల 23వ తేదీ ఆదోని భావసార కళ్యాణ మండపంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ మండలాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పాండవగల్ గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 200 రోజులు పనిదినాలు, కనీసం రూ.400 వేతనం ఇవ్వాలని, అందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఉపాధిహామీ పీడీ హాజరవుతున్నారన్నారు. సీఐటీయూ నాయకుడు పాండురంగ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోవిందు, హుసేన్ పాల్గొన్నారు.